
ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం సెప్టెంబరు 25, 2024

చేయి చేయి కలిపి..

మత్స్యకారుల సంఘం రూ. 15 లక్షలు



జిల్లా మత్స్యకారుల సంఘం వరద బాధితుల సహాయ నిధికి రూ. 15 లక్షల విరాళం అందజేసింది. సంఘం ప్రతినిధులు సంబంధిత చెక్కును మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మత్స్యకారుల సంఘం నాయకులు పామంజి శేషయ్య, ఆప్కాఫ్ మాజీ ఛైర్మన్ కొండూరు పాలిశెట్టి, తాటిచెట్లపాలేనికి చెందిన త్యాగరాజు, వాయుల బాబు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

వాకర్స్ సంఘాలు రూ.11.24 లక్షలు



విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సేకరించిన రూ. 11,24,028ను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. సంబంధిత చెక్కును మంగళవారం జేసీ కార్తీక్‌కు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, సంఘాల నాయకులు రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, రఘురామ్ ముదిరాజ్, దేవరాల సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, నళినీమోహన్, ఎస్.వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, నెల్లూరు గ్రామీణ తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

మన సొమ్మా..

మనకొచ్చిన బాధా!

జీజీహెచ్‌లో వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తే ప్రయోజనం



ప్రభుత్వ ఆసుపత్రి సెల్లార్‌లో పక్కన పడేసిన స్ట్రెచర్లు, వీల్ చైర్లు, ఇతర పరికరాలు. అరకొర పనులు చేస్తే అందుబాటులోకి వచ్చేవే.

న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్)

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని సెల్లార్‌లో ఇలాంటి పరికరాలు కొన్ని వందల సంఖ్యలోనే ఉన్నాయి. వీటిని బాగు చేయిస్తే.. ఆసుపత్రి అవసరాలకు సరిపడా వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లు అందుబాటులోకి వస్తాయి. ఎటొచ్చి.. ఆ దిశగా చర్యలు తీసుకునేవారే కరవయ్యారు. కొన్నింటికి బోల్టులు, స్క్రూలు బిగిస్తే సరిపోతుంది.. కనీసం ఆ పని చేయించడం లేదు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కచ్చితంగా ఒక వర్క్‌షాపు ఉండాలన్న నిబంధన ఉంది. కర్నూలు, తిరుపతి తదితర చోట్ల దీన్ని నిర్వహిస్తున్నారు. ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేసి.. ఆసుపత్రిలోని ప్రతి వస్తువును తక్షణం మరమ్మతులు చేయిస్తున్నారు. జిల్లాలోనే ఆ వ్యవస్థ లేకపోవడంతో విలువైన వస్తువులు మూలనపడటంతో పాటు రోగులు, వారి తరఫు బంధువులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది.



ఈ పరికరానికి మూడు చక్రాలు బాగున్నాయి. ఒక్కటి మాత్రమే మరమ్మతులకు గురైంది. చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే రోగులకు ఉపయోగపడుతుంది. పక్కన పడేశారు.

దాతృత్వానికేదీ సార్థకత

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రూ. కోట్లలోనే నిధులు వస్తుంటాయి. అయినా.. సేవల్లో ఎక్కడో ఒక చోట ఏదో లోపం తరచూ వెలుగు చూస్తూనే ఉంది. ఆ క్రమంలో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న వీల్‌ఛైర్లు, పడకలు, స్ట్రెచర్లలో కొన్ని దాతలు సమకూర్చినవే. వాటిని జాగ్రత్తగా చూసుకోవాల్సిపోయి.. చిన్న సమస్య వచ్చినా.. మూలనపడేస్తున్నారు. ఆసుపత్రి సెల్లార్ కిందనున్న పరిస్థితులే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి...

వర్క్‌షాపు ఏర్పాటు చేస్తే చాలా పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీలో వర్క్‌షాపు నిర్వహణకు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవచ్చు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి.. ఏర్పాటు చేస్తాం.
– డాక్టర్ బి.సిద్ధా నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

రెండింతల సంతోషం



ఈనాడు నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం), న్యూస్‌టుడే

కూటమి అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు శ్రమించిన నాయకులు, పార్టీ గెలుపునకు త్యాగాలకు వెనకాడని విధేయులకు ప్రభుత్వం పట్టం కట్టింది. వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. మొత్తం 20 కార్పొరేషన్లతో పాటు.. 99 నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయగా.. అందులో రెండు కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా జిల్లావాసులు ఎంపికయ్యారు. మరో ముగ్గురికి సభ్యులుగా అవకాశం కల్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు ఇచ్చిన హామీని నెరవేర్చడంపై కూటమి నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విధేయతకు పట్టం

నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా.. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్న ఎస్.కె.అబ్దుల్ అజీజ్‌కు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ బాధ్యతలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అప్పగించారు. ఈయన 2014 ఎన్నికల్లో వైకాపా తరఫున కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచి నెల్లూరు కార్పొరేషన్ మేయర్ అయ్యారు. కొద్దికాలానికే.. ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి తెదేపాలో చేరారు. 2019 ఎన్నికల సమయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ తెదేపా అభ్యర్థిగా పోటీ చేయాల్సిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి చివరి నిమిషంలో పార్టీని వీడటంతో.. తెదేపా అధిష్ఠానం సూచనలతో అబ్దుల్ అజీజ్ బరిలో నిలిచారు. నాడు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగా అజీజ్‌ను అధిష్ఠానం నియమించింది. 2020 సెప్టెంబరులో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి వైకాపా పాలనపై నిరంతరం పోరాడారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినా.. వెనుకాడలేదు. 2024 ఎన్నికల్లో నెల్లూరు రూరల్ అభ్యర్థిగా పోటీ చేస్తారని భావించినా.. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైకాపాను వీడి తెదేపాలో చేరిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అవకాశం దక్కింది. అయినా నిరాశకు గురికాకుండా.. పార్టీ అధినేత సూచనలతో పార్టీ గెలుపునకు కృషి చేశారు. దానికి గుర్తింపుగా తొలి విడతలో ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో అజీజ్‌ను వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ పదవి వరించింది.



అజీజ్‌కు కేకు తినిపిస్తున్న శ్రీనివాసులురెడ్డి తదితరులు

వక్ఫ్ ఆస్తులు పరిరక్షిస్తాం..

అన్యాక్రాంతం అయిన వక్ఫ్‌బోర్డు భూములను తిరిగి స్వాధీనం చేసుకునేలా చూస్తా. వాటి పరిరక్షించి సమాజానికి మేలు జరిగేలా చేస్తా. – అబ్దుల్ అజీజ్

జనసేనలో క్రియాశీలకం



ఏపీ టిడ్కో హౌసింగ్ ఛైర్మన్‌గా ఎంపికైన వేములపాటి అజయ్‌కుమార్ ప్రస్తుతం జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధిగా, ఆ పార్టీ నెల్లూరు జిల్లా పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు వేములపాటి అనంతరామయ్య కుమారుడైన అజయ్‌కుమార్.. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ సమయం నుంచే రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. చిరంజీవి యువతను వెన్నంటే ఉండి నడిపించారు. నాడు ‘స్పార్క్’ సదస్సులు ఏర్పాటు చేసి. వారికి అండగా నిలిచారు. ఆ తర్వాత పవన్‌కల్యాణ్ జనసేన స్థాపించినప్పటి నుంచి.. అందులో క్రియాశీలకంగా వ్యవహరించారు. మొదట్లో పార్టీలో ఉన్న వర్గ విభేదాలను పరిష్కరించడంలోనూ కీలకంగా మారారు. పవన్‌కల్యాణ్ పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గంలో ఏడుగురి కమిటీలో అజయ్‌కుమార్ కూడా ఉన్నారు. ఆయన సేవలకు తగిన గుర్తింపు లభించిందని ఆ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్లలో సభ్యులుగా...



పట్టాభిరామిరెడ్డి



నరసింహస్వామి



అనూరాధ

పలు కార్పొరేషన్లలో సభ్యులుగా ముగ్గురికి అవకాశం కల్పించారు. కోవూరు నియోజకవర్గానికి చెందిన తాళ్ల నరసింహస్వామికి రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లో స్థానం దక్కింది. దీంతో ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న వ్యక్తికి న్యాయం జరిగిందని ఆ పార్టీ నాయకులు ఆనందంగా ఉన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు బుచ్చి నగర పంచాయతీ ఎన్నికల్లో.. రెండు స్థానాల్లో తెదేపా గెలిస్తే.. అందులో ఒకరు నరసింహస్వామి కోడలు కావడం గమనార్హం. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సభ్యుడిగా వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి చోటు దక్కింది. ఈయన తెదేపాలో క్రియాశీలకంగా ఉన్నారు. గతంలో ఏఎంసీ ఛైర్మన్‌గా చేయడంతో పాటు తెదేపా తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్ర షెడ్యూల్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులుగా కావలి నియోజకవర్గానికి చెందిన తిరువీధి అనూరాధను ఎంపిక చేశారు.

సేవ్ తిరుమల..

మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

నెల్లూరు(వేదాయపాళెం), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూను అపవిత్రం చేశారంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, తితిదే మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డికి కలిపి ఒకే దిష్టిబొమ్మను జనసేన నాయకులు దహనం చేశారు. మంగళవారం నెల్లూరు నగరంలోని వీఆర్ కళాశాల నుంచి గాంధీబొమ్మ వరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. సేవ్ తిరుమల అంటూ నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. తమ అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన పాశ్చాత్తాప దీక్షకు మద్దతుగా ఆందోళన కార్యక్రమం నిర్వహించామన్నారు. తితిదే ఛైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, మంచికంటి శ్యామ్, నందినీ, మహేష్ శర్మ, ప్రసన్న, సుధామాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బంగారు బాబు



కర్ణాటకకు చెందిన గోల్డ్ మెన్ రిజమూన్ నెల్లూరు నగరంలో మంగళవారం సందడి చేశారు. ఒంటిపై 2.400 కిలోల బంగారంతో నగరవీధుల్లో తిరిగారు. ఆయన్ను చూసిన వారు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా రిజమూన్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లాకు చెందిన తాను 31 ఏళ్లుగా అక్కడే స్థిరపడినట్లు తెలిపారు. 30 ఎకరాల కాఫీ ఎస్టేట్ ఉందని, రెడ్‌లన్స్ కంపెనీ రీజినల్ మేనేజర్‌గా ఆరు రాష్ట్రాలు చూస్తున్నట్లు వివరించారు. తనకు అయిదు భాషలు వచ్చని, తెలుగు కూడా త్వరలో నేర్చుకుంటానన్నారు. సింగర్ హనిసింగ్ బంగారు వాచ్, బ్రాస్‌లెట్లు, చైన్లు వేసుకుని ముంబయిలో పాటలు పాడుతాడని, ఆయన్ని చూసి 2010 నుంచి బంగారంపై తాను ఆసక్తి పెంచుకున్నట్లు తెలిపారు. ఒంటిపై 5 కిలోల బంగారం వేసుకోవాలన్నదే తన లక్ష్యం అన్నారు. నెల్లూరులో డీలర్‌ను కలిసేందుకు వచ్చానని వివరించారు.

–ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

యూజర్ ఛార్జీల వసూళ్లలో..

చేతివాటం

నిమ్మ మార్కెట్ కేంద్రంగా సాగిన వ్యవహారం



‘కంచె చేను మేసింది’ అన్న రీతిలో ఉంది కొందరు మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరు. సరకు రవాణా వాహనాల నుంచి పక్కాగా యూజర్‌ఛార్జీలు వసూలు చేయాల్సిన వారు.. అందులో చేతివాటం ప్రదర్శించారు. ఎక్కువ నగదు వసూలు చేసి.. రికార్డుల్లో తక్కువగా నమోదు చేసి స్వాహా చేశారు. అందుకోసం వేర్వేరు రసీదులు సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. ఈ వ్యవహారాన్ని జిల్లా అధికారులు గుర్తించినా.. గుట్టుచప్పుడు కాకుండా ఉంచారన్న ఆరోపణలు ఉన్నాయి.

వెంకటాచలం, న్యూస్‌టుడే

సర్వేపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీని ఆరేళ్ల కిందట ఏర్పాటు చేయగా.. నిమ్మ మార్కెట్‌కు పేరొందిన పొదలకూరులో దీని ప్రధాన కార్యాలయాన్ని అందుబాటులో ఉంచారు. ఇక్కడి నుంచి దిల్లీ, జయపుర, ఉత్తర్‌ప్రదేశ్ తదితర ప్రాంతాలకు నిమ్మకాయలు భారీగానే ఎగుమతి అవుతుంటాయి. ఆ క్రమంలో కాయలు రవాణా చేసే వాహనాల నుంచి మార్కెటింగ్ కమిటీ అధికారులు (సూపర్‌వైజర్లు) యూజర్ ఛార్జీలు వసూలు చేయాల్సి ఉంది. లోడింగ్‌ను బట్టి అది ఎంత అని నిర్ణయమవుతుంది. ఈ వసూళ్లలోనే అక్రమాలు చోటు చేసుకున్నాయి. సూపర్‌వైజర్లు దగ్గరుండి పర్యవేక్షించాల్సిన ఈ విధులను.. యార్డ్ అసిస్టెంట్లకు రికార్డులు అప్పగించి.. వసూళ్లు చేయించినట్లు తెలిసింది.

వసూళ్లు ఎక్కువ.. నమోదు తక్కువ

యూజర్ ఛార్జీలు వసూలు చేసిన తర్వాత.. బిల్లు పుస్తకంలో నమోదు చేయాల్సి ఉంది. ఒక్కొక్క బిల్లుకు మూడు రసీదులు ఉంటాయి. ఎంత నగదు వసూలు చేశారో రాసి.. అందులో పైనున్న (ఒరిజినల్) రసీదును డ్రైవరుకు ఇవ్వాలి. రెండో రసీదును కార్యాలయంలో అప్పగించి.. అందులో నమోదు చేసిన విధంగా నగదు చెల్లించాలి. మూడో రసీదు పుస్తకంలోనే ఉంటుంది. ఇక్కడే అధికారులు చేతివాటం ప్రదర్శించారు. డ్రైవరుకు ఇచ్చే రసీదులో వసూలు చేసిన మొత్తం నమోదు చేసి. . కార్యాలయంలో నగదు చెల్లించే, పుస్తకంలో ఉండే రసీదుల్లో తక్కువ రాసి.. మిగిలిన నగదు స్వాహా చేశారు. నగదు వసూళ్లు, రసీదుల దిద్దుబాటు, ప్రభుత్వ ఖజానాకు జమ చేయడంలో అక్రమాలను గతంలోనే అధికారులు గుర్తించినా.. ఆ విషయం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు. వారం కిందట బయటకు రావడంతో తీవ్ర చర్చనీయాంశమైంది.

రహదారిపై యథేచ్ఛగా..

పొదలకూరు వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద తనిఖీ, శిస్తు వసూళ్ల పేరుతో వాహనాల వద్ద నిత్యం భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. నాలుగు నెలల కిందట రొయ్యల ఎగుమతి కంటైనర్ వద్ద మార్కెటింగ్‌శాఖ సూపర్‌వైజర్ ఒకరు నగదు తీసుకుంటుండగా- వీడియో తీసి పక్కా ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తర్వాత కూడా అక్రమ వసూళ్లు ఆగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నా దృష్టికి వచ్చింది

సర్వేపల్లి మార్కెటింగ్ కమిటీ పరిధి పొదలకూరులో వాహనాల వద్ద యూజర్ ఛార్జీల వసూళ్లు, చెల్లింపుల్లో తేడాలు వచ్చాయన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులను, ఉద్యోగులను వివరణలు అడిగాం. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి.. అక్రమాలు జరిగి ఉంటే చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం.
– అనిత కుమారి, మార్కెటింగ్‌శాఖ ఏడీ



కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఆనంద్ పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆ సందర్భంగా గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ తదితరులు - నెల్లూరు (కలెక్టరేట్)





కొత్తపల్లిలో తవ్వకాలు .. అనంతసాగరంలోని ఓ ప్రైవేటు స్థలంలో గ్రావెల్ డంప్

అక్రమానికి అడ్డేదీ?

అనంతసాగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికారం మారినా.. జిల్లాలో అధికారులు మారుతున్నా... గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపు మాత్రం ఆగడం లేదు. అధికారులు యథాలాపంగా జిల్లాలో ఎక్కడా మట్టి, గ్రావెల్ తవ్వకాలు లేవన్న మాటలే వినిపిస్తుండగా- మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా తమ పని తాము కానిచ్చేస్తున్నారు. అందుకు నిదర్శనం.. అనంతసాగరం మండలం కొత్తపల్లిలో సాగుతున్న దందానే... ఇక్కడి శివారులోని ప్రైవేటు భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే పొక్లెయిన్, టిప్పర్ల ద్వారా గ్రావెల్ తవ్వి.. అనంతసాగరం, కచిరదేవరాయపల్లి తదితర గ్రామాలకు తరలిస్తున్నారు. కొందరు నాయకులు బహిరంగ మార్కెట్‌లో ఉన్న గిరాకీని సొమ్ము చేసుకుంటుండగా- ఈ తంతు మొత్తం రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ గ్రావెల్ అక్రమ రవాణాపై తహసీల్దారును వివరణ కోరితే ప్రైవేటు భూముల్లో తమ జోక్యం ఉండదన్నారు. ప్రస్తుతం నిబంధనలు మారాయని చెబుతుండగా- మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ మాత్రం అనంతసాగరం మండలంలో గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, అక్రమంగా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకునే అధికారం తహసీల్దారు, పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

భళా.. పూజిత



ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు భూటాన్‌లో జరిగిన ఆసియా ఆట్యా-పాట్యా ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని జట్టుకు కీలకపాత్ర పోషించిన నగరపాలక సంస్థ బీవీఎస్ పాఠశాల విద్యార్థిని తుమ్మల పూజితను కలెక్టరు ఆనంద్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయా జ్యోతి, ఉష కల్యాణి, అరుణ, వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్ కుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(క్రీడా విభాగం)

అడుగంటిన రాళ్లపాడు

రాళ్లపాడు జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 6.5కు చేరింది. జలాశయం నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో తాగునీరుకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి సోమశిల జలాశయానికి చందిన ఉత్తర కాలువ ద్వారా రాళ్లపాడు ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని పలువురు కోరారు. - న్యూస్‌టుడే, లింగసముద్రం, కందుకూరు



చినుకు రాలితే చింతే!



చిన్న వర్షమొచ్చినా రహదారులు బురదమయంగా మారుతుండంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీతారామపురం- ఉదయగిరి జాతీయరహదారిలో రంగనాయుడుపల్లి, బసినేనిపల్లి సమీపంలో సంజీవరెడ్డినగర్-ఎర్రపల్లిగడ్డ కాలనీ మధ్య వంతెన వద్ద రహదారిపై వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయాన్ని జాతీయరహదారి ఏఈ సుమన్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సీతారామపురం

తుప్పు.. ముప్పు

నెల్లూరు నగరం జెండావీధిలో చిన్న చిన్నసందుల్లో ఎప్పుడో ఏర్పాటు చేసిన పాత ఇనుప విద్యుత్తు స్తంభాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. కొన్ని గోడల్లో ఉండగా.. మరికొన్ని అడుగు భాగంలో చిలుము పట్టి ఉన్నాయి. ఇలాంటి చిన్న వీధుల్లో అనేకం దర్శనమిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులు వస్తారని స్థానికులు చెబుతున్నారు. ముందుగానే గుర్తించి ప్రమాదకర స్తంభాలు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

-ఈనాడు, నెల్లూరు



లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : లోక్ అదాలత్‌తో కేసులు సత్వరం పరిష్కారమవుతాయని సీనియర్ సివిల్ న్యాయమూర్తి వాణి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాలతో ఇందుకూరుపేట హరిజనవాడలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు గూడు, నీడ, కూడు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నుంచి మహిళల అక్రమ రవాణా జరుగుతోందన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు.

27న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు రానున్నారని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా చదివిన వారు ధ్రువపత్రాలు, ఆధార్, బయోడేటా తీసుకురావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మేళా జరుగుతుందని తెలిపారు. వివరాలకు 94944 56326, 79896 13024 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రసన్నుడి రథం భద్రతపై ఆరా

బిట్రగుంట, న్యూస్‌టుడే: కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి రథం భద్రతపై మంగళవారం రాత్రి బిట్రగుంట పోలీసులు ఆరా తీశారు. అనంతపురం జిల్లాలో ఓ రథం కాలిపోయిన నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. కావలి గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాపారావు, బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ వచ్చి రథాన్ని పరిశీలించారు. ఈవో రాధాకృష్ణ రథం భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

బలవంతంగా పనులు.. అరకొర బిల్లులు

గత ప్రభుత్వ తీరుతో అధికారులు, సభ్యుల ఆందోళన



వైకాపా ప్రభుత్వ పాపాలు వెంటాడుతున్నాయి. అప్పట్లో చేసిన అభివృద్ధి పనుల్లో కొన్ని అసంపూర్తిగా ఉండిపోగా.. బిల్లులు సకాలంలో చెల్లించలేదు. గుత్తేదారుల చేత బలవంతంగా పనులు చేయించిన జిల్లా పరిషత్ పాలక సభ్యుల్లో బిల్లుల భయం వెంటాడుతోంది.

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల్లో వివిధ పథకాలకు సంబంధించి దాదాపు రూ.90 కోట్ల వరకు బిల్లులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఇష్టానుసారంగా పనులు జరిగాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులకు సంబంధించిన బిల్లులు ఇస్తుందా లేదా అనే భయం వారిలో నెలకొంది. స్వయంగానే జడ్పీటీసీ సభ్యులే భరోసా ఇచ్చి గుత్తేదారులచేత కొన్ని పనులు చేయించారు. మరికొన్ని ఎవరు ముందుకు రాకపోవడంతో స్థానిక పరిస్థితులను బట్టి బినామీల పేర్లతో కొందరు జడ్పీటీసీ సభ్యులే చేశారు. జూన్, ఆగస్టు నెలల్లో జరిగిన జడ్పీ స్థాయీ కమిటీల సమావేశాల్లో జడ్పీటీసీ సభ్యులు బిల్లుల మీద పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు.

మార్కెట్ కమిటీల నిధుల పేరుతో..

ప్రధానంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల నిధుల పేరుతో జరిగిన రోడ్లు, డ్రైయిన్ల పనులకు సంబంధించిన బిల్లులు దాదాపు 70 శాతం ఆగిపోయాయి. సచివాలయ భవన నిర్మాణాలు, గ్రామ ఆరోగ్య కేంద్రాలు, రైతుభరోసా కేంద్రాలు, బల్క్‌మిల్క్ కలెక్షన్ యూనిట్, గడప గడపకు మన ప్రభుత్వ పనులకు, జల్‌జీవన్, జగన్నకాలనీలు తదితర వాటి బిల్లుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

వైకాపా సభ్యులే గగ్గోలు

తాము పైరవీలైన పనులు చేసినా బిల్లులు రాక అవస్థలు పడుతున్నామంటూ చిట్టకుల జడ్పీటీసీ సభ్యురాలు వాపోయారు. ఎంపీపీల్లో కూడా సమాధానం చేయకపోవడం దారుణమన్నారు. వరికుంటపాడు, విడవలూరు, కొడవలూరు, మర్రిపాడు, కావలి మండలాల్లో జరిగిన పనులకు పాత బిల్లులను నిలిపివేయడంతో పలు బిల్లులు తెలిపారు. ఇటు జడ్పీటీసీ సభ్యులు, అటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, గృహనిర్మాణ సంస్థ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాత బిల్లులపై ఇరకాటంలో పడుతున్నారు.

ఉన్నతాధికారులకు లేఖలు

జగనన్న ఇళ్ల స్థలాల లెవెలింగ్ చేసిన చిన్నపాటి గుత్తేదారులకు అప్పట్లో రూ.30కోట్ల వరకు బిల్లులు నిలిపివేయాయని చెబుతున్నారు. ఈ విషయంపై ఏమి చేయలేక ఉన్నతాధికారులకు లేఖలు రాస్తున్నట్లు అధికారులే చెప్పుకోవడం గమనార్హం. కొన్ని మండలాల్లో గతంలో చేసిన పనులకు కూడా ఎంబుక్‌లో రికార్డులు చేయని పరిస్థితి ఉంది. బిల్లుల విషయమై కూడా అధికారులు సమాధానం చెప్పలేకున్నారు. త్వరలో జరగబోయే సమావేశాల్లో తమ గొంతు వినిపించేందుకు, రూ.కోట్ల బిల్లుల పెండింగ్‌పై చర్చకు పలువురు జడ్పీటీసీ సభ్యులు ఓ కమిటీగా ఏర్పడుతున్నారు.

అటవీ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు: రేంజ్ అధికారి

వరికుంటపాడు, న్యూస్‌టుడే: అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఉదయగిరి అటవీ శాఖ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి హెచ్చరించారు. మండలంలోని విరువూరు అటవీ శాఖ ప్లాంటేషన్‌లో ఎర్రచందనం మొక్కలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విరువూరు పరిధిలో 932 ఎకరాల అటవీ భూమి ఉందన్నారు. ప్రస్తుతం 40 హెక్టార్లలో మొక్కలు వేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే 20 హెక్టార్లలో నాటామని, మరో 20 హెక్టార్లలో పెంచేందుకు మొక్కలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్లపడియ బీట్ అధికారి షేక్ కరిముల్లా పాల్గొన్నారు.



ఎర్రచందనం మొక్కలను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరరెడ్డి

స్పార్క్ సిటీ లేఅవుట్ పరిశీలన

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్పార్క్ సిటీ లేఅవుట్‌ను లోకాయుక్త పరిశోధనా విభాగం డీడీ వి.గంగరాజు మంగళవారం పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో ఇరిగేషన్ స్థలం, ప్రభుత్వ స్థలం, శ్మశానవాటిక స్థలం దాదాపు 3ఎకరాలుందని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎల్.కృష్ణప్రసాద్ కర్నూలు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దాంతో కమిషనర్ గంగరాజు పరిశీలనకు పంపారు. పురపాలక కమిషనర్ గంగాప్రసాద్, ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు సుధీర్, సర్వేర్లతో కూడిన స్పార్క్ సిటీలో కలసిన ప్రభుత్వ, ఇరిగేషన్, శ్మశాన స్థలాలు పరిశీలించారు. స్థానికుల అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. వీటన్నింటిని లోకాయుక్త ముందు ఉంచనున్నారు. ఈ సందర్భంగా ఈ లేఅవుట్‌లో స్థలాలు కొన్నవారు పరిశీలనపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న లోకాయుక్త పరిశోధనా విభాగం డీడీ గంగరాజు

కలెక్టర్‌కు నివేదిస్తా: బ్రిజిత

బిట్రగుంట, న్యూస్‌టుడే: ఇటీవల పాము కాటుకు గురైన వ్యక్తికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం జరిగిందన్న ఆరోపణలపై బోగోలు మండలంలోని కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కావలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ బ్రిజిత విచారణ చేశారు. ఈ నెల 2వ తేదీ రాత్రి అల్లిమడుగు సంఘానికి చెందిన బొచ్చు శంకర్ పాము కాటుకు గురవగా వైద్యం కోసం కోవూరుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే పట్టించుకోనందున మరణించారని బాధితుల వైపు నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఆమె ఆ రోజు రాత్రి విధుల్లో ఉన్న డాక్టర్లను విచారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచారణ సారాంశాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు.



విచారిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ బ్రిజిత

సమాచార స్రవంతి

నిమ్మకాయల ధరలు

పొదలకూరు (కిలో..)
పెద్దవి : రూ. 55
చిన్నవి : రూ. 75

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ.7,217
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.57,736
వెండి గ్రాము :	రూ.94.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్స్	209
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	238
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	122
లేయర్	144
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	260
లేయర్ మాంసం	195

దేవాదాయశాఖలో ఈవోల బదిలీ

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: జిల్లా దేవాదాయశాఖ పరిధిలోని పలు దేవస్థానాల ఈవోలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం ఈవోగా మైపాడు గ్రూప్ టెంపుల్స్ ఈవోగా పనిచేస్తున్న ఏవీ శ్రీనివాసులరెడ్డి నియమితులయ్యారు. మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, ఆరణికందప్పమేస్త్రి సత్రం ఈవోగా తిరుపతి జిల్లా వెంకటగిరి గ్రూప్ టెంపుల్స్ ఈవోగా పనిచేస్తున్న ఏవీ శ్రీనివాసులురెడ్డి, నరసింహకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా పల్నాడు జిల్లా అమరావతి దేవస్థానం నుంచి వేమూరి గోపీని నియమించారు. వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రూప్ టెంపుల్స్ ఈవోగా ఎన్.శ్రీధర్‌నాయుడు, గంగపట్నం చాముండేశ్వరి దేవస్థానం, ఇందుకూరుపేట గ్రూప్-3 దేవస్థానాల ఈవోగా టి.శ్రీనివాసరావు, ఈపూరు గ్రూప్ టెంపుల్స్ ఈవోగా ఎ.భాస్కర్‌రెడ్డి, వీరాంజనేయస్వామి దేవస్థానం, గొలగమూడి గ్రూప్ దేవస్థానాల ఈవోగా వై.మాధవి, మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య సత్రం ఈవోగా జి.రమణారెడ్డి, సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా పి.రఘురామయ్య, వింజమూరు గ్రూప్ దేవస్థానాల ఈవోగా బి.శాంతయ్య, కావలి గ్రూప్ దేవస్థానాల ఈవోగా కె.మస్తాన్‌బాబు నియమితులయ్యారు.

గుడి ఒకటే.. ఇద్దరు ఈవోలు

నెల్లూరు రాయాజీవీధి ఆంజనేయస్వామి ఆలయ ఈవోలుగా ఎం.రవికృష్ణ(గ్రేడ్-2), పి.సంపూర్ణమ్మ(గ్రేడ్-3)ను నియమించారు. ఒకే దేవస్థానానికి ఇద్దరు ఈవోలను నియమించటం పొరపాటుగా జరిగిందని మార్పుచేసి కొత్త జాబితా పంపుతారని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దనరెడ్డి తెలిపారు.



పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు, ముఖ్య అతిథులు

బాలు పురస్కారాల ప్రదానం


నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు కళాకారులకు బాలు పురస్కారాలు ప్రదానం చేశారు. టౌన్‌హాల్‌లో మంగళవారం రాత్రి జరిగిన బాలు వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు కళానీరాజనం సమర్పించారు. నిర్వాహకులు ఇంద్రజాలికులు రాంజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాజపా నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చిన్నారి యశిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి జి.రాఘవేంద్రరావు, డీటీసీ కార్యాలయం పరిపాలనాధికారి డి.రామమోహనరాజు, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, చేతన సాంస్కృతిక వేదిక కార్యదర్శి శేషగిరీశం, సంకీర్తన కళాసమితి నిర్వాహకులు ప్రసాద్‌బాబును ఘనంగా సత్కరించారు.

క్యాన్సర్‌పై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ బొమ్మ నుంచి టౌన్‌హాల్ వరకు క్యాన్సర్‌పై మంగళవారం అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. వ్యాధి వచ్చిన తరువాత నివారణకు మందులు వాడడం కన్నా.. రాకుండా ముందుగానే జాగ్రత్త పడటం ఎంతో మేలన్నారు. క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీహెచ్‌పీలు కృషి అభినందనీయమన్నారు. నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ నటరాజన్ కన్నన్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, శాఖ వరపు వేణుగోపాల్, అనుములు జయప్రకాష్, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్‌బాషా, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య



కరస్పాండెంట్‌కు నగదు అందజేస్తున్నఎస్సై ఇంద్రసేనారెడ్డి

సీఎం సహాయ నిధికి రూ. 1.10 లక్షల విరాళం


ఉదయగిరి, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల నిధికి స్థానిక హోలీ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం రూ.1.10 లక్షల విరాళాలు సేకరించింది. స్థానిక పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన నగదును పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు కరుణకుమారికి అందజేశారు. ఈ నగదును సీఎం సహాయనిధికి పంపుతామన్నారు.

భూముల పరిశీలన

అనుమసముద్రంపేట : కావలిఎడవల్లిలో ఆర్డీవో మధులత పర్యటించారు. అయితా సుబ్బమ్మ ఫిర్యాదుపై గ్రామంలోని భూమిని పరిశీలించారు. తొలుత రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. టైటిల్‌డీడ్, పాస్‌పుస్తకాలు తదితర విషయాలపై రీవెరిఫికేషన్ చేసే విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చేయాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దారు శ్రీరామకృష్ణ, ఆర్ఐ తేజ, ఇతర సిబ్బంది ఉన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం): శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి 12 వరకు వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన ఉత్సవ ఏర్పాట్లపై ఆలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, ఆర్డీవో మాలోలతో చర్చించారు. ఉత్సవ నిర్వహణకు 18 మందితో కమిటీ ఏర్పాటు చేశామని, ఛైర్మన్‌గా అలహరి విజయకుమార్ వ్యవహరిస్తారన్నారు. విజయదశమి ముందురోజు 60 అడుగుల రావణాసురుని కటౌట్ ఏర్పాటు చేసి వధించే వేడుకను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల ప్రచార పోస్టర్లు, ఆహ్వానపత్రికలు ఆవిష్కరించారు. జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే, అధికారులు

డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: విజయ డెయిరీ పాలక వర్గ మండలిలో రొటేషన్ పద్ధతిలో జరిగే మూడు డైరెక్టర్ల పదవులకు ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విడవలూరు మండలం అన్నారెడ్డిపాలెం ఎంపీఎంపీసీఎస్ నుంచి అన్నం శ్రీహరి, ముత్తుకూరు మండలం నారికేళ్లపల్లి ఎంపీఎంపీసీఎస్ నుంచి కోట చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరు మండలం వాసిలి ఎంపీఎంపీసీఎస్ గంగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మొత్తం నలుగురు నామినేషన్లు దాఖలు చేయడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. ఓజిలి మండలం తిరుమలపూడి ఎంపీఎంపీసీఎస్ సభ్యుడు తాళ్లూరు బాబు నాయుడు మంగళవారం తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో.. మిగతా అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు.

17 రోజులుగా చెత్త తీయరా..?

కోవూరులో అధికారులపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆగ్రహం



కాలువలో చెత్తను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, బుచ్చి, కొడవలూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలో 17 రోజులుగా చెత్తతీయరా అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె పట్టణంలోని చేపల మార్కెట్, బజారు కూడలిలో పర్యటించారు. పలువురు మహిళలు తమ వీధుల్లో చెత్తను తీయలేదని, తొలగించాలంటే పారిశుద్ధ్య కార్మికులు నగదు డిమాండ్ చేస్తున్నారని ఆమెకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ ఈవో శివకుమార్‌ను ఇలా ఉంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆమె స్వయంగా చీపురు పట్టుకొని వీధులు శుభ్రం చేశారు. తిరుపతి లడ్డూపై తనమీద వస్తున్న ఆరోపణలను కొట్టిపడేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దారు నిర్మలానందబాబా, తెదేపా మండలాధ్యక్షులు మల్లారెడ్డి, కార్యదర్శి నాగరాజు, నాటకరాణి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చి నగర పంచాయతీలో 14, 17 వార్డుల్లో పర్యటించారు. త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కొడవలూరు మండలం రామన్నపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులతో కలిసి మాట్లాడారు. తెదేపా నాయకులు అనీష్, శ్రీహరిరెడ్డి, ఛైర్‌పర్సన్ సుప్రజ, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులు.. క్రీడల్లో ఘనులు

న్యూస్‌టుడే, రాపూరు, పొదలకూరు

గ్రామీణ ప్రాంత విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారు... వివిధ విభాగాల్లో బరిలో దిగితే పతకమే లక్ష్యంగా పలు విజయాలు సాధించారు... ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సత్తాచాటుతున్నారు. రాపూరు మండలం కండలేరు డ్యాం అంబేడ్కర్ బాలికల సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో 634 మంది విద్యార్థులు చదువుతున్నారు.. ప్రిన్సిపల్ భారతి స్థానికంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభను గుర్తించి వసతులు సమకూరుస్తున్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తున్న పలువురు విద్యార్థినులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

✍ పేరు ▲ తల్లిదండ్రులు ● ఊరు ✎ చదువు ✓సాధించిన పతకాలు ✌ లక్ష్యం



✍ ఆర్.లక్ష్మీప్రసన్న ▲ రాజేశ్, కృషా
● ముదివర్తి ✎ సీనియర్ ఇంటర్
✓ రెజ్లింగ్‌లో రెండు పతకాలు
✌ ఐపీఎస్ అధికారి కావాలన్నదే లక్ష్యం



✍ ఎస్‌కే హాజీరా ▲ జమీర్, షబానా
● నెల్లూరు ✎ సీనియర్ ఇంటర్
✓ కబడ్డీలో మూడు పతకాలు
✌ జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం



✍ ఎం.విక్టోరియా ▲ మోసే, దయాలమ్
● పాలిచెర్లపాడు ✎ సీనియర్ ఇంటర్
✓ కబడ్డీలో రెండు పతకాలు
✌ ఐపీఎస్ అధికారి..



✍ రేష్మ ▲ కె.పెంచలయ్య, విజయమ్మ
● గుండవోలు ✎ జూనియర్ ఇంటర్
✓ రెజ్లింగ్‌లో మూడు పతకాలు
✌ ఇంజినీరుగా సేవలందించాలి..

కావలి
• కావలి • ఉదయగిరి • కందుకూరు

జాగ్రత్తల్లేకుంటే జైలుకే: డీఎస్పీ

కావలి, న్యూస్‌టుడే: టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తోందని కావలి డీఎస్పీ పి. శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని చేవూరివారి తోట, మద్దూరుపాడులో టపాసుల గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా చేవూరివారితోట విక్రేత రికార్డులు చూపించలేదు. వాటిని తీసుకొచ్చి తన కార్యాలయంలో చూపించాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ ఫిరోజ్, ఎస్సై గోపీచంద్ ఉన్నారు.

టపాసుల గోదాము తనిఖీ

వింజమూరు : కావలి-ఉదయగిరి రోడ్డును ఆనుకుని గ్యాస్ గోదాము సమీపంలో ఉన్న టపాసుల దుకాణాన్ని కలిగిరి సీఐ, ఎస్సైలు వెంకటనారాయణ, వీరప్రతాప్ మంగళవారం తనిఖీ చేశారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మాటలతో సరి.. పూర్తి కాని ఇళ్లు

పేదలందరికీ స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తాం.. ఇందుకు కాలనీలు ఏర్పాటుచేస్తున్నాం.. ఇవన్నీ ఊళ్లుగా మారతాయని మాజీ ముఖ్యమంత్రి జగన్ చెప్పిన మాటలు అయిదేళ్లలో అమలు కాలేదు. స్థలాల కేటాయింపుతో సరిపెట్టారు. కాలనీలు ఏర్పాటుచేయగా వాటిలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో సొంత గూడు వస్తుందనుకున్న పేదల ఆశలు తీరలేదు. ఎన్నో చోట్ల పునాదుల్లోనే ఆగిపోయాయి. మరికొన్నిచోట్ల మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ పిచ్చిచెట్లతో నిండిపోయాయి. ఈనేపథ్యంలో కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో పరిస్థితిపై కథనం.

-న్యూస్‌టుడే, కావలి

అసంపూర్తి గూడు.. అస్తవ్యస్తం చూడు



కందుకూరు పట్టణం : ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తున్నామని వైకాపా ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. మరోపక్క జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించిన ఇనుప చువ్వలు తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. మహదేవపురం అర్బన్, దివివారిపాలెం లేఅవుట్లలో లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని గుత్తేదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు చేశారు. పిల్లర్లకు వాడిన ఇనుప చువ్వలు తుప్పుపట్టాయి. బేస్‌మెంట్లు దిబ్బతిన్నాయి. మరోపక్క గుత్తేదారులు బేస్‌మెంట్ వరకు చేసిన పనులకుగానూ ఒక్కో ఇంటికి సుమారు రూ.70వేల చొప్పున బిల్లులు చేయించుకున్నట్లు సమాచారం. కొండికందుకూరు అర్బన్ లేఅవుట్‌లో ఒక్కటంటే ఒక్క ఇళ్లు కూడా నిర్మాణం పూర్తి కాలేదు.

ఏళ్లుగా.. అసంపూర్తిగా..



అల్లూరు : మండల కేంద్రమైన అల్లూరులోని గోగులపల్లి రోడ్డులో జగనన్న కాలనీలో ఏళ్లుగా ఇళ్లు అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. దీంతో పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఈ కాలనీలో 343 ఇళ్లు మంజూరయ్యాయి. 110 ప్రారంభం కాలేదు. ప్రారంభమైన 343 పక్కా గృహాల్లో ఎక్కువగా అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని నాసిరకంగా కనిపిస్తున్నాయి. సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో కొన్ని నిర్మాణాలు మధ్యలోనే నిలిపివేశారు. ఈ విషయమై వర్క్ ఇన్‌స్పెక్టరు బాలసుబ్రమణ్యంను వివరణ కోరగా ఇంజినీరింగ్ సహాయకులు పర్యవేక్షణ ఉందని, తాము బిల్లుల చెల్లింపులకే పరిమితం అయినట్లు వివరించారు.

ఇవి ఇంతేనా?

కావలి : గత ప్రభుత్వ హయాంలో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పేరిట కొలువుదీర్చిన జగనన్న లేఅవుట్లు ఎటూ కొరగాకుండా ఉన్నాయి. చాలా లేఅవుట్లలో నిర్మాణాలు పూర్తి కాలేదు. పురపాలక పరిధిలోని ముసునూరు, బుడంగుంట లేవుట్లలో ఇంతవరకూ ఒక్కరూ తలదాచుకునేలా ఇళ్లు నిర్మించలేదు. గత ఏడాది నిర్మాణంలో ఉండగానే కొన్ని కూలడంతో లబ్ధిదారుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ముసునూరు మెగా లేఅవుట్‌లో చదును చేసే పనుల్లో నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. గుత్తేదారులతో పూర్తి చేయిస్తామని గృహ నిర్మాణ సంస్థ ఏఈ నరేంద్ర తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.



ఇది కాలనీయేనా?

వింజమూరు : గ్రామంలోని ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న జగనన్న కాలనీ అధ్వానంగా ఉంది. అంతర్గత, అప్రోచ్ రోడ్లు సరిగ్గా లేవు. వర్షం పడితే వింజమూరు-భట్టువారిపాలెం రోడ్డు నుంచి వెళ్లడం కష్టం. ఇళ్ల మధ్యలో కంప చెట్లు పెరిగాయి. ఎక్కడ తోలిన మట్టి అక్కడే ఉంది. అత్యధిక శాతం పునాదిలోనే ఉన్నాయి. లేఅవుట్ వేసినప్పుడు నాటిన చెట్లు ఎండిపోయాయి. ఆప్షన్-3 కింద చేపట్టిన ఇళ్లు పునాదిలోనే ఆగిపోయాయి. పంచాయతీ పరిధిలో ఎనిమిది లేఅవుట్లలో వెయ్యికి పైగా ఇళ్లు మంజూరు చేశారు. ఈ విషయమై ఏఈ సయ్యద్ పీరన్ మాట్లాడుతూ గుత్తేదారుల ద్వారా జరుగుతున్న నిర్మాణాలను ప్రస్తుతం నిలిపివేశారన్నారు. ఈ నెల 28న కాలనీల్లో లబ్ధిదారులు, గుత్తేదారులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.



మురుగుకాలువ గోడ నిర్మాణం

కందుకూరు గ్రామీణం : మోపాడులో రామాలయం పక్క వీధిలో నిర్మించిన మురుగుకాలువ గోడ నిర్మించిన మూణ్నాలకే ముక్కలు కావటంతో ఈనాడులో ఆగస్టు 1న ' హవ్వ నవ్విపోరూ..'అని, సెప్టెంబరు 14న 'మరమ్మతులు.. ఎప్పుడో?' శీర్షికలతో ఈనాడులో చిత్రకథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు కొత్తగా మురుగుకాలువ గోడ నిర్మించారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా

బిట్రగుంట : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కావలి, బోగోలు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడల పోటీలు

వింజమూరు : గ్రామంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల స్థాయిలో స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. వాలీబాల్, ఖోఖో, చెస్ విభాగాల్లో అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలను నాలుగు కేటగిరీల్లో ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్ రెడ్డి, పీడీ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: విజయవాడలో వరద సహాయ విధులకు ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాల్లో తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో విడతల వారీగా అందరినీ పంపించారు. ప్రయాణ ఛార్జీలు కూడా ఇవ్వలేదు. **- పారిశుద్ధ్య కార్మికులు, కావలి పురపాలక సంఘం**

సమాధానం: బిల్లులు ట్రెజరీకి పంపించాం. మంజూరు కాగానే ఖాతాల్లో జమ చేస్తాం. **- శ్రీనివాసులురెడ్డి, ఏఈ -కావలి, న్యూస్‌టుడే**

సమస్య: కావలి రోడ్డుకు ఇరువైపులా కంపకర్ర చెట్లు పెరగడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. **-సింగయ్య, అల్లూరు**

సమాధానం: త్వరలో తొలగిస్తాం. **-నాగరాజు, ర.భ ఏఈ, -అల్లూరు, న్యూస్‌టుడే**

వరద బాధితులకు చేయూత

కావలి గ్రామీణం : విజయవాడలో వరద బాధితులకు మన్నంగిదిన్నె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వితరణ చేశారు. రూ.8 వేలు డీడీని మంగళవారం ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యకు అందజేశారు.

అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన: ఎమ్మెల్యే

వలేటివారిపాలెం : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన కొనసాగుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొటిగా అమలు చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కలవళ్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఏడీఏ అనసూయ, తహసీల్దారు అబ్దుల్ అమీద్, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం పాల్గొన్నారు. పట్టణంలో నేరాలు అరికట్టేందుకుగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు దాతలు ముందుకొచ్చి సీసీ కెమెరాలకు విరాళాలు అందజేశారు. వీపీజీ జ్యూయలర్స్ అధినేత సుకుమార్ రూ.50వేలు, కాకుమాని ప్రవీణ్ రూ.25వేలు, చీదెళ్ల శ్రీను, ఆరికట్ల ప్రసాద్, నూకల సుబ్బారావు రూ.10వేల చొప్పున అందజేశారు.

సమన్వయంతో కందుకూరు అభివృద్ధి

కందుకూరు పట్టణం : అన్ని వర్గాలు, పార్టీల నాయకులను సమన్వయం చేసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యమని కందుకూరు అభివృద్ధి సలహా కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వెంగమాంబ కల్యాణ మండపంలో మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్, ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు, సీపీఐ, వైకాపా, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం : కృష్ణారెడ్డి

కావలి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి పాలన అద్భుతంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ప్రకటించారు. మంగళవారం 13వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వేగూరు చంద్రశేఖర్, జనసేన నాయకులు అళహరి సుధాకర్, సిద్ధు, తెదేపా, భాజపా పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, కుట్టుబోయిన బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ అభివృద్ధి : కాకర్ల

జలదంకి : రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని రామవరప్పాడులో సర్పంచి ఉన్నం సరస్వతి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తెదేపా మండల అధ్యక్షుడు పి.మధురెడ్డి, గ్రామ నాయకులు కె.రామచంద్రయ్య, రవి, మురళి, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఏడీఏ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూడికతీత పనులు

బిట్రగుంట : బిట్రగుంట సబ్‌డివిజన్ పరిధిలో శ్రీవెంకటేశ్వరపాలెం మేజరు పరిధిలోని కాలువల్లో పూడికతీత, షట్టర్ల అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. రూ.90 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు డీఈఈ సత్యప్రసాద్, ఏఈ నాగార్జునరెడ్డి తెలిపారు.

తితిదే పవిత్రత కాపాడాలి

కావలి : రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా, తిరుమల పవిత్రతను కాపాడాలని భాజపా, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కావలిలో ప్రదర్శనగా వెళ్లి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భాజపా నాయకులు సీవీసీ సత్యం, కుట్టుబోయిన బ్రహ్మానందం, మందా కిరణ్ మాట్లాడారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

కందుకూరు గ్రామీణం : పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఏవీ సుబ్బారెడ్డి సూచించారు. పలుకూరు, మహదేవపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఐ.వెంకటేష్, వివేక్, ఆర్.కామత్, డ్వామా ఏపీడీ జె.బాబూరావు, ఏవో వి.రాము పాల్గొన్నారు.

సీతారామపురం : సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు వస్తాయని పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సురేఖాదేవి , వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. పబ్బులేటిపల్లి, చిన్నాగంపల్లి పంచాయతీల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయాల్లో భద్రతా చర్యలు చేసుకోవాలి..

ఉదయగిరి: ఉదయగిరి సర్కిల్ పరిధిలోని ఆలయాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా నిర్వాహకులు భద్రతా చర్యలు తీసుకోవాలని సీఐ వెంకటరావు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవటంతోపాటు రాత్రి సమయంలో వాచ్‌మెన్లను నియమించుకోవాలన్నారు.

పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ వితరణ

కావలి గ్రామీణం : మండలంలోని చలంచెర్ల పంచాయతీలోని పెద్దవరం ప్రాథమిక పాఠశాలలో విశాఖపట్నానికి చెందిన వ్యాపారవేత్త ఇరువూరి మాల్యాద్రి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్‌ను మంగళవారం వితరణ చేశారు. ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య ఆయన్ను అభినందించారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ఉదయగిరి : ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జాతీయ స్వచ్ఛత పక్షోత్సవాలను పురస్కరించుకొని ప్రొఫెసర్లు, విద్యార్థులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సమాజ సేవకు ఎన్ఎస్ఎస్ వేదిక

కందుకూరు పట్టణం : టీఆర్ఆర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఆందోళన

కందుకూరు పట్టణం : జాతీయ రహదారి 167-బి నిర్మాణంలో భాగంగా కందుకూరు నుంచి గుడ్లూరు వెళ్లే రోడ్డులో ఎర్రవాగు వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు.

ప్రత్యేక హోదా కోరుతూ సైకిల్ యాత్ర

శ్రీకాళహస్తి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే పురోభివృద్ధి చెందుతుందని కావలికి చెందిన కంతూరు శ్రీనివాస్ అన్నారు. ఇందు కోసమని కావలి నుంచి కాణిపాకానికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తికి వచ్చారు. కాంగ్రెస్ జెండాలతో సైకిల్‌పై యాత్రను చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో పీఏసీఎస్ మాజీ ఛైర్మన్‌కు గాయాలు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: వేగంగా వెళుతున్న కారుకు గేదె అడ్డుగా రావడంతో ప్రమాదానికి గురవగా వరికుంటపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం గాయపడ్డారు. ఈసంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. అటుగా వస్తున్న ఎస్సై ఎం.రఘునాథ్ కారులో ఇరుక్కుపోయిన వెంకటరత్నంను గుర్తించి బయటకు తీసి సమీపంలోని ప్రకాశం జిల్లా పామూరుకు తన కారులో తీసుకెళ్లి చేర్చారు. ఎస్సైను పలువురు అభినందించారు.

జూదరుల అరెస్టు

కావలి, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రకోట గ్రామ వడ్డిపాలెంలో జూద స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం కావలి గ్రామీణ పోలీసుస్టేషన్ ఎస్సైలు బాలకృష్ణ, ఖాజీబాబు దాడులు చేసి అయిదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిపై దాడి

బిట్రగుంట : సుందరగిరివారికండ్రికలో మంగళవారం గంపా బాబూరావుపై అదే గ్రామానికి చెందిన గంపా సురేష్, మరికొందరు దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రుడు కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై బోజ్యానాయక్ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

లింగసముద్రం : అన్నేబోయినపల్లిలో మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహ్మద్ సుభానీ తెలిపారు. **ఉలవపాడు :** అక్రమంగా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. భీమవరంలో ఇసుక నింపుకొని వస్తున్న ట్రాక్టరును పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. **గుడ్లూరు :** నరసాపురంలో మూడు ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మద్యం స్వాధీనం.. ఉలవపాడు: మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. రామాయపట్నంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న అతని వద్ద 54 మద్యం సీసాలు దొరికాయి.

ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

పొదలకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.2.50 కోట్ల సీఎస్సార్ నిధులు సమీకరించి ఆధునికీకరిస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చాటగొట్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గొర్రెలు, కోళ్ల పెంపకానికి రాయితీ రుణాలు మంజూరవుతాయని చెప్పారు. తెదేపా పాలనలో పనిచేసి నిలిపేసిన నీరు-చెట్టు పనులకు సంబంధించి జిల్లాకు రూ.250 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏడీఏ శివనాయక్, ఏవో వాసు, హెచ్‌వో ఆనంద్, ఎంపీడీవో నగేష్‌కుమారి, తహసీల్దారు సారంగపాణి, తెదేపా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అయ్యన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



సోమిరెడ్డి చేతుల మీదుగా చెక్కును అందిస్తున్న అమరావతి స్కూలు యాజమాన్యం

వరద బాధితులకు రూ.2.41 లక్షల విరాళం

పొదలకూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పొదలకూరు అమరావతి పాఠశాల యాజమాన్యం విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ.2,41,001 విరాళాన్ని మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల సంఘం (అపుస్మ) జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడుకు అందజేశారు. ఆయన ద్వారా విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ సురేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: విడవలూరు మండలం దంపూరు పంచాయతీ రామచంద్రాపురం ఎస్సీ కాలనీలో కాలువలు లేక నీరు ఇళ్ల ఎదుట పేరుకుపోయింది. – కాలనీవాసులు, రామచంద్రాపురం

సమాధానం: కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. – దశరథరామిరెడ్డి, ఎంపీడీవో

? పొదలకూరు మండలం బత్తులపల్లి అరుంధతీయవాడలో విద్యుత్తు తీగ సరిగా లేక నీరు రావడం లేదు. – శ్రీహరినాయుడు, స్థానికుడు.

✔ బంపింగ్ కేబుల్ సరఫరా లేదు. వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తాం.– శ్రీకాంత్, డిస్కం ఏఈ

? మర్రిపాడు మండలం పి.ఎన్.పల్లి-పంపలూరు మార్గంలో రోడ్డు కోతకు గురైంది. – వెంకటేశ్వర్లు, వాహనదారుడు

? చుంచులూరు-గంగపాలెం రోడ్డు రాళ్లు తేలి గుంతలమయంగా మారింది. – శ్రీను, స్థానికుడు.

? పెగళ్లపాడు ఎస్సీ కాలనీ నుంచి పెగళ్లపాడు వెళ్లే దారిలో ముళ్లపొదలు పెరిగి ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. – కొండయ్య, స్థానికుడు

✔ సమస్యలు పరిష్కరిస్తాం. – ఖాదర్‌మస్తాన్, పీఆర్ ఏఈ

? మర్రిపాడులో తిక్కవరం వెళ్లే మార్గంలో వర్షం వస్తే రహదారిపై నీరు నిలుస్తోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. – మహబాషా, స్థానికుడు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – అనిల్, ఆర్‌అండ్‌బీ ఏఈ

అయిదేళ్లుగా సంపద శూన్యం..!

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి స్వచ్ఛంద మార్గాలలో సంకల్పంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో గత తెదేపా పాలనలో చెత్త సంపద సృష్టి కేంద్రాలు నిర్మించారు. గృహాల నుంచి సేకరించిన చెత్తను గ్రామాల్లో నిర్మించిన కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి సన్నాహాలు చేసింది.. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత పూర్తిగా నిర్వీర్యం చేసింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన, సేంద్రియ ఎరువుల తయారీ తొట్టెలు నిరుపయోగం మారాయి. కొన్ని చోట్ల మందు బాబులకు అడ్డాగా మారాయి. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయాయి. పంచాయతీలకు వచ్చిన నిధులను వేరే పనులకు మళ్లించి వీటి నిర్వహణ సంగతే మరిచారు. మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని పల్లెలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. అయిదేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

గ్రామాల్లో పచ్చదనం కనుమరుగు..

మర్రిపాడు(ఆత్మకూరు, గ్రామీణం): ఆత్మకూరు నియోజకవర్గంలోని 135 పంచాయతీల్లో 95 చెత్త సంపద కేంద్రాలను రూ.3.07 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించారు. మర్రిపాడు మండలంలోని నందవరం చెత్త సంపద కేంద్రం పిల్లర్ల దశలో నిలిచిపోయింది. పొంగూరు, పి.ఎన్.పల్లి, ఏపిలగుంట, ఖాదర్‌పూర్ గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టలేదు.



చుంచులూరులో శిథిలావస్థలో చెత్త సంపద కేంద్రం

చుంచులూరు, పొంగూరు కండ్రిక, చినమాచనూరు, బూదవాడ, చిలకపాడులో శిథిలావస్థకు చేరాయి. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెత్త రిక్షాలు, వాహనం నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేయాలని ప్రజలు గ్రామ, మండల అధికారులకు విన్నవిస్తున్నారు.

తొంభై శాతానికి పైగా నిరుపయోగం..

మనుబోలు: మనుబోలు, వెంకటాచలం, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో 116 పంచాయతీలున్నాయి. 80కి పైగా చెత్త సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. 90 శాతానికి పైగా వినియోగంలో లేవు. పొదలకూరు మండలంలో 21 ఉండగా నాలుగు మాత్రమే ఉపయోగకరంగా ఉన్నాయి. మనుబోలు మండలంలో 15 ఉండగా అయిదు మాత్రమే చెత్తను తరలించి వర్మీ కంపోస్టు తయారీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. తోటపల్లిగూడూరు, వెంకటాచలం, ముత్తుకూరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



మనుబోలు మండలం పిడూరుపాలెంలో..

ప్రబలుతున్న వ్యాధులు

కోవూరు: కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండలాల్లో సుమారు 64 చెత్తతో సంపద కేంద్రాలను తెదేపా పాలనలో నిర్మించారు. 12 మాత్రమే బాగున్నాయి, 52 కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయి. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ సంచాలకులు పడుగుపాడులోని కేంద్రాన్ని పరిశీలించినా అధికారులు హడావుడి చేసి మమ అనిపించారు. వారం రోజుల్లో సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో అధికారులు, పంచాయతీ సిబ్బంది మధ్య సమన్వయం లేక జాప్యం జరుగుతుందనే విమర్శలున్నాయి. కోవూరులో చెత్త సంపద కేంద్రం అసంపూర్తిగా ఉంది. ప్రతిరోజూ పది ట్రాక్టర్ల చెత్తను గుంతల్లో వేస్తున్నారు.



కోవూరు మండలం పాటూరులో

గణేశుని లడ్డూ అధరహో

మనుబోలు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విశ్వనాథ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. లడ్డూ అధరహో అనేలా రూ.3,06,000లకు వెంకటేశ్వర్లు, నగదు మాలను రూ.2.25 లక్షలకు మేకల యోగేశ్వరరావు దక్కించుకున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

మనుబోలు, తోటపల్లిగూడూరు, విడవలూరు, కోవూరు, అనంతసాగరం, మర్రిపాడు, ఏఎస్‌పేట, చేజర్ల: యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మనుబోలు ఏవో జహీర్ అన్నారు. రైతు సేవా కేంద్రం-1లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తోటపల్లిగూడూరు మండలంలోని నరుకూరు, పేడూరు గ్రామాల్లో ఏడీఏ రాజ్‌కుమార్ పచ్చిరొట్ట విత్తనాల ప్రాధాన్యతను వివరించారు. విడవలూరులో వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ అన్నదాతలకు రబీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతసాగరం ఏవో శ్రీధర్‌రెడ్డి లింగంగుంట, మంచాలపల్లిలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఇర్లపాడు, మర్రిపాడులో ఏవో రామ్మోహన్ మాట్లాడుతూ మిరపపంటలో ముడతలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుమసముద్రం, చందలూరుపాడు, చేజర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి.

ఆరు నెలలుగా నిర్లక్ష్యమేనా

విడవలూరు మండలం తుమ్మగుంటలోని రైతు సేవా కేంద్రం ఇది. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వంద రోజులైంది. నెలలు గడుస్తున్నా అప్పటి పేర్లు, శిలాఫలకంలోని చిత్రాలు మారలేదు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ పరిశీలించి పేర్లు తొలగిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, విడవలూరు



పన్నెండేళ్లుగా.. అసంపూర్తిగా



తుపాన్లు, భారీ వర్షాలకు తలదాచుకునేందుకు, స్థానికంగా సమావేశాలు నిర్వహించేందుకు 2012లో పొదలకూరు మండలం చాటగొట్లలోని బీసీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించారు. అప్పట్లో భవనానికి మంజూరైన నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో భవనానికి ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు వంటివి ఏర్పాటు చేయలేదు. పన్నెండేళ్లు అసంపూర్తిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేయాలని విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు

కూలితేనే స్పందిస్తారా..

మనుబోలు మండలం గొట్లపాలెం సమీపంలోని పొలాల్లో విద్యుత్తు స్తంభం ఒక వైపునకు వాలి ప్రమాదకరంగా మారింది. తీగల ఆధారంగా ఉండటంతో ఏక్షణంలోనైనా కూలుతుందని రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డిస్కం అధికారులు స్పందించి స్తంభాన్ని మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మనుబోలు



పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం



కోవూరు పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక వీధిలో తాగునీటి ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైన్‌ను పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మరమ్మతులు చేయించారు. 'ఈనాడు'లో 'పైపులైన్ లీకేజీతో నీటి వృథా' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. ఆయన స్పందించి పైపులైనుకు మంగళవారం మరమ్మతులు చేయించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, కోవూరు

కరెంటు ఉంటేనే కళకళ.. లేకుంటే వెలవెల



సంగం ప్రాథమిక సహకార సంఘానికి అనుబంధంగా గత రెండేళ్లుగా పెట్రోల్‌బంకు నడుస్తోంది. కూడలిలో ఉండటంతో వ్యాపారం బాగా ఉంది. అయితే, అక్కడ కరెంటు లేకుంటే వాహనాలకు ఇంధనం నింపడం సాధ్యం కాదు. దాంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా వ్యాపారం తగ్గుతోంది. వెంటనే జనరేటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సీఈవో దస్తగిరి మాట్లాడుతూ జనరేటర్ ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. –న్యూస్‌టుడే, సంగం

క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణ అభినందనీయం



పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య

కొడవలూరు, న్యూస్‌టుడే: క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ పరీక్షలు నిర్వహణ అభినందనీయమని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య తెలిపారు. కొడవలూరు మండల పరిషత్తు కార్యాలయ సమావేశ స్థలంలో మంగళవారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 35 సంవత్సరాలు దాటిన మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని.. సుభిక్షంగా ఉండాలని



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న మర్రిపాడు గ్రామస్థులు

మర్రిపాడు(సంగం), న్యూస్‌టుడే: పుష్కలంగా వర్షాలు కురవాలని.. ప్రజలు సుభిక్షంగా ఉండాలని మర్రిపాడు గ్రామస్థులు మంగళవారం తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. ఉదయం అయిదు గంటలకు ప్రారంభమైన వీరి యాత్ర సంగం బ్యారేజీ వద్దకు ఉదయం తొమ్మిది గంటలకు చేరింది. అల్పాహారం తర్వాత తిరిగి బయలుదేరారు. గత పదేళ్లుగా తాము ఈ యాత్రను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ నెల 28న స్వామివారిని దర్శించుకుంటామన్నారు.

ఆగని ఖనిజ దోపిడీ



పలుకురాళ్లు తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు

న్యూస్‌టుడే, సైదాపురం

వైకాపా అయిదేళ్ల పాలనలో ప్రకృతి సంపదను కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కఠిన చర్యలు తీసుకోవడంతో అక్రమార్కుల దందాకు అడ్డుకట్ట పడింది. అయితే కొన్ని గ్రామాల్లో సెలవు రోజుల్లో కొందరు పెట్రేగిపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా తరలిపోతున్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వీడటం లేదు. కొన్ని నెలలుగా ఇది పరిపాటిగా మారింది. తెల్లరాయి, పలుకురాళ్లను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. గ్రామస్థాయిలో పర్యవేక్షించాల్సిన రెవెన్యూ సిబ్బంది తమకెందుకులే అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. సైదాపురం మండలంలో మైకా, పల్స్‌పర్, క్వార్జ్, వర్మిక్యులేట్ లాంటి ఖనిజ సంపదతో పాటు పలు కురాళ్లు విస్తారంగా అందుబాటులో ఉన్నాయి. ఖనిజ సంపదను తరలించాలంటే మైనింగ్ అనుమతులు పొందాలి. చాగణం, రాగనరామాపురం, సైదాపురం, మొలకలపూండ్ల, జోగిపల్లి, ఊటుకూరు ప్రాంతాల్లో పలు కురాళ్లను పొడిచేసే కర్మాగారాలున్నాయి. మైనింగ్ అనుమతులు ప్రభుత్వం నిలిపివేయడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ భూముల్లో పోగుచేసి తరలిస్తున్నారు. ట్రక్కు ధర మూడు నుంచి అయిదువేల రూపాయల వరకు పలకడంతో వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు దృష్టిసారించి అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పట్టణంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలకు శ్రీసాంబశివా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. 8వార్డులో శీలా సుభద్రాదేవి, 4వ వార్డులో షేక్ ఖాదర్‌బాషా, 18వార్డులో మల్లె చిన్నమ్మ, చెలమచర్ల వెంకటయ్య, 22వార్డులో డి.పోలమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ కుటుంబాలకు రూ.10వేల చొప్పున మొత్తం పంపిణీ చేశారు.

కబడ్డీ జిల్లా జట్టుకు చిరమన విద్యార్థి ఎంపిక

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: కబడ్డీ జిల్లా జట్టుకు ఏఎస్‌పేట మండలం చిరమన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దార్ల హర్షవర్ధన్ ఎంపికయ్యారు. ఆత్మకూరు నియోజకవర్గస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఈ విద్యార్థి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మాడభూషి కవిత్వంపై పరిశోధనలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్ కవిత్వంపై పరిశోధనలు చేసిన ఇద్దరు మంగళవారం పీహెచ్‌డీలు అందుకున్నారు. 'మాడభూషి కవిత్వానుశీలన' అనే అంశంపై తిరుమల స్వాతి పరిశోధన చేయగా, 'సంపత్ కుమార్ కవిత్వం - సామాజిక చిత్రణ' అనే అంశంపై బీవీఎస్ గౌతమ్ పరిశోధన చేశారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో తమిళనాడు గవర్నర్ రవి చేతుల మీదుగా తెలుగులో పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు సంపత్ కుమార్ తెలిపారు. మైసూర్ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు ఆర్వీఎస్ సుందరం నవలలపై పరిశోధనలు చేసి వేప విజయలక్ష్మి అనే మహిళ పట్టా అందుకున్నారని పేర్కొన్నారు.

సన్మార్గంలో నడుద్దాం

కోవూరు, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో ప్రతి ముస్లిం నడవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. పడుగుపాడులో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొని మాట్లాడారు. పరమత సహనం, శాంతి, సౌభ్రాతృత్వంతో మెలగాలని మహ్మద్ ప్రవక్త బోధించారన్నారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

దేశసేవలో భాగస్వాములు కావాలి

విడవలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు దేశసేవలో భాగస్వామ్యం కావాలని విడవలూరు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మధు పిలుపునిచ్చారు. విడవలూరు పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వారాహి అమ్మవారి పూజలతో సకల శుభాలు'

సంగం, న్యూస్‌టుడే: వారాహి అమ్మవారి పూజలతో సకల శుభాలు కలుగుతాయనీ, లోకకల్యాణం జరుగుతుందని వేలూరులోని వారాహి శక్తి పీఠం అధిపతి స్వామి యోగరుషి వారాహిస్వామి అన్నారు. సంగంలోని తిరమనతిప్ప మీద కొలువై ఉన్న రాజరాజేశ్వరిదేవి ఆలయానికి మంగళవారం వచ్చిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

కోవూరులో నిర్బంధ తనిఖీ

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని స్టౌవ్‌బీడీ కాలనీలో మంగళవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు నిర్బంధ తనిఖీ (కార్డన్ సెర్చ్) నిర్వహించారు. నిద్రపోతున్న ప్రజలు ఉన్నట్లుండి పోలీసుల తనిఖీలతో భయాందోళనకు గురయ్యారు. వారి గృహాల్లో ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు చూపించాలని కోరారు. 49 ద్విచక్రవాహనాలు, 6 ఆటోలకు సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మనుబోలు, న్యూస్‌టుడే: వేగంగా వెళుతున్న బస్సు టైర్ ఒక్కసారిగా పంక్చర్ కావడంతో అదుపు తప్పిన ఘటన అంబేడ్కర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... శ్రీవెంకటరమణ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సు విజయవాడ నుంచి చెన్నైకు వెళుతోంది. టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డు మార్గంలోకి దూసుకెళ్లింది. సుమారు 50 మీటర్ల వరకు వ్యతిరేక మార్గంలోకి దూసుకెళ్లడంతో మరో టైర్ పంక్చరైంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు బోల్తా పడలేదు. దీనికి తోడు ఆ సమయంలో గూడూరు నుంచి నెల్లూరు వైపు ఎలాంటి వాహన రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. టోల్‌ప్లాజా సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని క్రేన్ సాయంతో బస్సును పక్కన పెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారులకు గాయాలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని కాకుటూరు-చెముడుగుంట గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... నెల్లూరు నుంచి గూడూరు వైపునకు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని అదే మార్గంలో వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు చిన్నారులకు గాయాలవగా వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం సంఘటన స్థలం నుంచి వెళ్లిపోయింది.

నాలుగు ట్రాక్టర్ల స్వాధీనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గండ్లవీడు, వీర్లగుడిపాడు నుంచి సోమవారం రాత్రి ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు పట్టుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ఎస్ఐ జిలానీ, పోలీసులు ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టేందుకు రాత్రిపూట గస్తీ తిరుగుతూ నిఘా ఉంచినట్లు వివరించారు. బొగ్గేరులో ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, అప్పారావుపాళెం వద్ద మరో రెండింటిని పట్టుకొని సీజ్ చేసినట్లు వివరించారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

రసాయన ఎరువుల వినియోగం తగ్గించండి

రాపూరు, సైదాపురం, న్యూస్‌టుడే : పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే అన్ని విధాల రైతుకు లాభ సాటిగా ఉంటుందని రాపూరు వ్యవసాయాధికారి సోముసుందర్ పేర్కొన్నారు. మండలంలోని సిద్ధవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల కోసం వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల ద్వారా అందించే వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సైదాపురం వ్యవసాయాధికారిణి హైమావతి సూచించారు. సైదాపురం మండలంలోని తలుపూరు గ్రామంలో ఆమె పాల్గొన్నారు. ఉద్యాన, పశువైద్యసేవలపై ఆయా శాఖల అధికారులు రైతులకు వివరించారు. పశువైద్యాధికారి ప్రసాద్, సర్పంచి హరిత, ఇతరసిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

రాపూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెదేపా నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కోటూరుపాడులో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం తెదేపా ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నాయకులు వసంతకుమార్ నేతృత్వంలో ప్రజలకు వంద రోజుల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

న్యూస్‌టుడే, ఆత్మకూరు

ముఖాముఖి



వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ ఐ.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆత్మకూరు డివిజన్‌లో విద్యుత్తుపరంగా చేస్తున్న సేవలను ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు.. వర్షాకాలంలో గాలి వీస్తే అంతరాయం ఏర్పడుతోందనీ, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పలు అంశాలపై ఆయన చెప్పిన వివరాలిలా ఉన్నాయి.

అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా : వర్షాకాలంలో అంతరాయం లేకుండా కరెంట్ సరఫరాపై చేస్తాం. ప్రతినెలా క్రమం తప్పకుండా హెచ్‌టీ లైన్లకు చెట్లకొమ్మలు తగలకుండా తొలగిస్తున్నాం. డివిజన్‌లో 37 ఉపకేంద్రాల పరిధిలో 116 ఫీడర్లు 11కేవీ లైన్లున్నాయి. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 2179ఉండగా త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 4828 ఉన్నాయి. వీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎప్పటికప్పుడు లైన్ల సమస్యలు పరిష్కరిస్తున్నాం.

98.7 శాతం బిల్లుల వసూళ్లు

డివిజన్ పరిధిలో ప్రైవేటు కనెక్షన్ల బిల్లుల వసూళ్లు 98.7శాతంగా ఉంది. 82,422 ఇళ్ల కనెక్షన్లు, 7043వ్యాపార కనెక్షన్లు డివిజన్ పరిధిలో ఉన్నాయి. మరో 209 ఎల్‌టీ కనెక్షన్లు, 3113 ప్రభుత్వ తాగునీరు, వీధిలైట్లు కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం రూ.3.22కోట్లు ప్రతి నెలా వసూలు చేయాల్సి ఉంది. ఈ నెల ఇప్పటి వరకు రూ2.57కోట్లు (79.84శాతం) వసూళ్లు చేశాం. మిగిలిన లక్ష్యాలు సాధిస్తాం.

రైతులకు మొదటి ప్రాధాన్యత : రైతుల అవసరాలపై దృష్టి పెట్టాం. డివిజన్ పరిధిలో 757వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. నెలాఖరుకు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి వస్తుంది. మొదటి ప్రాధాన్యతగా రైతులకు అవసరమైన కనెక్షన్లు ఇస్తాం. డివిజన్‌లో 33,034 వ్యవసాయ కనెక్షన్లు ఇప్పటికే ఉన్నాయి. రైతులకు మేలైన సేవలు అందించేలా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న 24గంటల్లోనే మార్చేస్తాం.

డివిజన్‌లో 73మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సోమశిల జలవిద్యుత్తు కేంద్రాల ద్వారా 23 మెగావాట్లు, సౌర విద్యుత్తు ఉత్పత్తి.. నెల్లూరుపాళెం పరిధిలో 10మెగావాట్లు, వరికుంటపాడులో 10మెగావాట్లు, చేజర్లలో 30మెటావాట్లు ఉత్పత్తి అవుతోంది. ఉత్పత్తిపరంగానూ డివిజన్‌కు ప్రాధాన్యత ఉంది.



టిడ్కో ఛైర్మన్‌కు అభినందనలు

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్‌గా వేములపాటి అజయ్‌కుమార్ నియమితులైన సందర్భంగా జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

నెల్లూరు(వేదాయపాలెం): జిల్లా ఎక్సైజ్‌శాఖలో బదిలీలు చేస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న కె.హేమంత్ నాగరాజును ఒంగోలుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ ఏపీఎస్‌బీసీఎల్ డీజీఎం టి.శ్రీనివాసరావును నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పి.దయాసాగర్ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎన్‌సీసీ 5(ఏ) బెటాలియన్ తిరుపతి యూనిట్ కమాండింగ్ అధికారి అనూజ్‌వాధ్వా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఎంపిక, ప్రపంచ నదుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, వైస్ ప్రిన్సిపల్ ఏవీ రమణారావు, ఎన్‌సీసీ అధికారిణి డాక్టర్ సి.కూర్మాప్రియ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: మూలాపేట రామయ్యబడి ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్డుపై వెళ్లే వాహనదారులను కరుస్తున్నాయి. - సురేంద్రబాబు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. - డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? నీలగిరి సంఘం మసీదు వీధిలో కాలువలు పూడికతో నిండిపోయి దుర్గంధం వస్తోంది. - మనీషా

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? నిప్పో వెనుక ప్రాంతం హౌసింగ్‌బోర్డు కాలనీ కృష్ణమందిరం ఎదురువీధిలో హెచ్‌ఐజీ/82 నంబర్ గల స్తంభానికి వీధిదీపం చాలా రోజులుగా వెలగడం లేదు. - శివరామకృష్ణ

✓ వీధి దీపాలు వెలిగేలా చేస్తాం. - సూర్యతేజ, కమిషనర్

? సంతపేట గుప్పొపాపు ప్రాంతం కార్యాలయం సమీపంలో తాగునీటి వాల్వు నుంచి పెద్దఎత్తున నీరు లీకై రోడ్డుపాలవుతోంది. -వెంకట్

✓ నీటి లీకేజీని అరికడతాం. - సూర్యతేజ, కమిషనర్

- న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ, నవాబుపేట)

బరిలో దిగితే పతకమే

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

కరాటేలో రాష్ట్రస్థాయిలో చిన్నారుల ప్రతిభ

పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లు నెల్లూరుకు చెందిన చిన్నారులు క్రీడల్లో రాణిస్తున్నారు. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహంతో ప్రతిభ చూపుతూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు. నెల్లూరు నగరానికి చెందిన ఇద్దరు కరాటేలో పంచ్ కొడితే పతకాలు సాధించాల్సిందే అన్నట్లు దూసుకుపోతున్నారు. ఇటు చదువుల్లోనూ మంచి మార్కులు సాధిస్తూ.. అటు క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు.



కరాటే శిక్షణ నేర్చుకుంటున్న నెల్లూరు నగర విద్యార్థులు

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు



నగరానికి చెందిన జె.సత్య, రమ్యకుమారి దంపతుల కుమారుడు విష్ణేష్. 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగు సంవత్సరాలుగా కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. అప్పటి నుంచే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధించాడు. 2018లో అత్యధిక కిక్‌లు కొట్టినందుకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించాడు. 2020లో స్కై రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారం పతకం సొంతమైంది. ఈ ఏడాది విజయవాడలో జరిగిన కుంగ్ ఫూ పోటీల్లో పాల్గొని బంగారం పతకం సాధించాడు. ఈ ఏడాది డిసెంబరులో ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందాడు.

బంగారు జమీల్



నగరానికి చెందిన ఇమ్రాన్, రిజ్వానా దంపతుల కుమారుడు ఎస్‌కే జమీల్ 6వ తరగతి చదువుతున్నాడు. నాలుగు సంవత్సరాల నుంచే కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. 2022లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కై పోటీల్లో బంగారు పతకం, 2023లో నాయుడుపేటలో జరిగిన తైక్వాండో పోటీల్లో వెండి పతకం సాధించారు. ఈ ఏడాది విజయవాడలో జరిగిన కరాటే పోటీల్లో వెండి పతకం సొంతమైంది.

వరద బాధితులకు విరాళం

నెల్లూరు(క్రీడా విభాగం), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మంగళవారం క్రీడా మైదానానికి వచ్చిన నెల్లూరుగ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి రూ. 1,01,616 డీడీ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వాకర్స్ 206 గవర్నర్ పలగాటి శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, కార్యదర్శి గుర్రం వెంకట సురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, ముదిరాజ్, బాసం శేషగిరి రావు, తదితరులు పాల్గొన్నారు. ● విజయవాడలోని వరద బాధితులకు ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 63,666 నగదును స్టైల్ వాకర్స్ అసోసియేషన్ ద్వారా సభ్యులు నెల్లూరుగ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అందించారు.



గ్రామీణ ఎమ్మెల్యేకు డీడీ అందజేస్తున్న ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్

వసతులు తోడైతే

నెల్లూరు(రంగనాయకులపేట), న్యూస్‌టుడే: స్థానికుల నిర్వహణలో ఉన్న పీపుల్స్‌పార్కు.. హరనాథపురం ప్రజలకు ఆహ్లాదాన్ని చేరువచేస్తోంది. కమిటీ ఆధ్వర్యంలో పార్కును అభివృద్ధి చేసుకుంటూ ఆదర్శంగా నిలిచారు. స్థానిక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు దివంగత శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో పార్కును ప్రజలకు చేరువచేయడంతో పాటు ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తూ భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు కార్పొరేషన్ సహకారంతో విద్యుద్దీపాలు, జిమ్ పరికరాలు సమకూర్చుకున్నారు. ప్రత్యేకంగా యోగా సాధనకు అనుకూలంగా పార్కులో వేదికను నిర్మించుకున్నారు. నిర్వహణకు సొంత నిధులు వెచ్చించటం విశేషం.



పార్కు మధ్యలో పాడైన బల్ల.. చుట్టూ పెరిగిన గడ్డి

నగరపాలక సంస్థ సహకరిస్తే..

ఉన్నంతలో అభివృద్ధి చేసుకుంటున్నా.. కొన్ని సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ సహకరిస్తే మరింత మెరుగ్గా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. పార్కు చుట్టుపక్కల పరిసరాల్లో చెత్త వేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

ఆహ్లాదమే

పీపుల్స్‌పార్కు పేరుతో స్థానికుల నిర్వహణ

పార్కుకు వచ్చేవారికి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. వర్షాకాలం ట్రాక్‌లో నీరు నిలిచి వాకింగ్ చేసేవారికి అసౌకర్యం కలుగుతోంది. వాకింగ్ ట్రాక్ మధ్యలో ఉన్న ప్రాంతంలో ప్రజలు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన కొన్ని బల్లలు పాడైపోయాయి. ఆ ప్రాంతంలో పెరిగిన పిచ్చి చెట్టు గడ్డిని తొలగించి మరింత ఆహ్లాదంతో కళకళలాడేలా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ సహకారం అవసరమని వాకర్స్ కోరుతున్నారు.

● సమస్యపై నగరపాలక అధికారులు మాట్లాడుతూ పార్కును పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అండర్ బ్రిడ్జి కింద మురుగు నీరు



ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి కింద నిత్యం మురుగు నీటితో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కాలువలో మురుగునీరు పొంగి వంతెన కింద చేరుతోంది. అందులోనే ప్రజలు ముక్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వంతెన కింద మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నిత్యం వెలుగులే



నెల్లూరు నగరంలోని ఆనం వెంకటరెడ్డినగర్‌లో నిత్యం విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్తు వృథాతో పాటు విద్యుద్దీపం కాలిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి పగటి వెలుగులను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. తగిన చర్యలు తీసుకుంటామని నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ తెలిపారు.

- న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఇవేం పనులు



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రజాశక్తి నగర్ ప్రాంతంలో కొంత కాలం క్రితం బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది. రోడ్డులో ఓ వైపు చేతిపంపు ఉండగానే నిర్మాణం చేశారు. స్థానికులకు అవసరం ఉంటే పంపును ఉపయోగంలోకి తీసుకురావడం, లేదంటే తొలగించి రోడ్డు వేయాల్సి ఉంది. ఇవేమి లేకుండా రహదారి ఏర్పాటుతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

పోలీసులు లేని అవుట్ పోస్టు



నగరంలోని అయ్యప్ప గుడి ప్రాంతం కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. జాతీయ రహదారి నుంచి నగరానికి ప్రవేశించే మార్గం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువ. సాయంత్రం సమయంలో పూర్తిగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ ట్రాఫిక్ పోలీసు ఉండేందుకు అవుట్ పోస్టు ఉన్నా.. ఎవరూ ఉండరు. దాంతో తరచూ వాహనాలు తరచూ నిలిచిపోతున్నాయి. అధికారులు పోలీసును నియమించాలని స్థానికులు కోరుతున్నారు

- న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

బీటీఏ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : నెల్లూరు నగర, గ్రామీణ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం బీటీఏ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. బీటీఏ జిజిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పాఠశాలలకు గ్రాంట్ విడుదల చేయని కారణంగా పాఠశాల నిర్వహణ ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు హనీఫ్‌బాబు, రవికుమార్, హరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సేవా కార్యక్రమాలు



బ్లీచింగ్ చల్లుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ వీసీ ఆచార్య విజయభాస్కర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ మునిబాబు, వీఎస్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ కె.సునీత, ప్రోగ్రామ్ అధికారి ఉదయశంకర్, విద్యాప్రభాకర్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా లీగల్ సెల్ హర్షం

నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో ఇంటర్నేషనల్ లా కాలేజీ, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్న సందర్భంగా తెదేపా లీగల్ సెల్ న్యాయవాదులు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు. జిల్లా కోర్టు ఆవరణలో చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు షేక్ రియాబాషా, కార్యదర్శి రమేష్, సీనియర్ న్యాయవాదులు నన్నేసాహెబ్, టి.శంకరయ్య, కేవీఆర్ నాయుడు, గ్రామీణ సెల్ అధ్యక్షుడు షేక్ అన్వర్‌బాషా, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..

నెల్లూరు(నేర విభాగం): నూతన మద్యం విధానం అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం దేవరపాలెం వద్ద ఐఎంఎల్ డిపో వద్ద ర్యాలీ చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

జగన్ పాలనలో లెక్కలేనన్ని తప్పులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జగన్ పాలనలో తిరుమలలో లెక్కలేనన్ని తప్పులు జరిగాయని, నేరాలు, మోసాలు చేసిన పలువురిని ఛైర్మన్‌లు, సభ్యులుగా నియమించారని తెదేపా బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఆరోపించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 47వ డివిజన్‌లో మంగళవారం ఇంటింటా ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పీఎంపీల సేవలు ప్రశంసనీయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో పీఎంపీలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని నారాయణ మెడికల్ కళాశాల గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో గుండె, మానసిక, చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈఎన్‌టీ వైద్యులు టి.సుమన్, కృష్ణారెడ్డి, పీఎంపీల జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, లోకేశ్‌ను కలిసిన ఉపమేయర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అమరావతిలోని సచివాలయంలో నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పలు విషయాలపై చర్చించారు.

గృహనిర్మాణ సంస్థ ఈఈగా మాధవరావు

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: గృహ నిర్మాణ సంస్థ కావలి ఈఈగా ఎస్.మాధవరావును నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మూర్ఛకు విజయవంతంగా శస్త్రచికిత్సలు

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: మూర్ఛ ఎపిలెప్సీ సర్జరీ ద్వారా నయమవుతుందని నారాయణ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఎపిలెప్సీ సర్జరీ ద్వారా మూర్ఛ పూర్తిగా నయమయిన వారితో కలిసి నారాయణ ఆసుపత్రి వైద్యులు మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్ఏ.సాయికిరణ్, నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.హరీష్, న్యూరాలజిస్ట్ డాక్టర్ డిఆర్ అనూష తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నారాయణ హాస్పిటల్ వైద్యులు

అబ్దుల్ అజీజ్‌కు సన్మానం



రథంపై ఊరేగుతున్న అబ్దుల్ అజీజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్‌గా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయనను నెల్లూరు పార్లమెంట్ తెదేపా మైనార్టీ విభాగం అధ్యక్షుడు మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సన్మానించారు. బారకాస్ సెంటర్ నుంచి ఎర్రదర్గా మన్సూర్‌నగర్ వరకు రథంపై ఆయన్ని ఊరేగించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు చంద్రబాబు



స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడని, ఆయన సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం జరుగుతోందని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 48వ డివిజన్, ఉయ్యాల కాలువకట్ట ప్రాంతాలలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి మంగళవారం ఇంటింటా కరపత్రాలు అందించారు. ● నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 28వ డివిజన్ కేశవుల నగర్‌లో మంగళవారం జరిగింది. తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రూ.3వేలు ఉన్న పింఛను రూ.4వేలు చేశారన్నారు. ● నెల్లూరు రూరల్ నియోజకవర్గం 33వ డివిజన్‌కు చెందిన వైకాపా నాయకులు అలగల ప్రభాకర్, సాదిక్, హరి, పవన్‌గౌడ్ తెదేపాలో చేరారు. వారికి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్పొరేషన్‌లో..

ఏఈలు, డీఈలు స్థానచలనం

నెల్లూరు(నగరపాలక సంస్థ) : నెల్లూరు నగరపాలక సంస్థలో పలువురు ఏఈలు, డీఈఈలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి అధికారులను పలు మున్సిపాల్టీలకు బదిలీ చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఏఈ ఎస్‌కే ఫాజిల్‌ను కావలి మున్సిపాలిటీకి, డి.మాధవిని ఆత్మకూరు మున్సిపాలిటీకి, ఎం.సాయికృష్ణను వెంకటగిరికి, జి.అర్చితను ఒంగోలుకు బదిలీ చేశారు. కావలి మున్సిపాలిటీ ఏఈ డి.షైనీ, ఆత్మకూరు జిక్కి వెంకటవరలక్ష్మి, తిరుపతి తుడా ఎం.భవ్యను నెల్లూరు నగర పాలకసంస్థకు బదిలీ చేశారు. అలాగే ఏపీటిడ్కో నెల్లూరు డీఈఈ టి.రఘురామ్‌ను చీరాల మున్సిపాలిటీ, నెల్లూరు నగరపాలకసంస్థ డీఈఈ పీవీ అనిల్‌కుమార్‌ను ఒంగోలుకు, సీహెచ్ సురేష్‌ను ఒంగోలుకు, ఒంగోలు డీఈఈ బీవీ రఘురామ్‌ను నెల్లూరుకు, ఒంగోలు డీఈఈ ఎన్‌వీ రామ్మోహన్‌రావును నెల్లూరుకు, కావలి మున్సిపాలిటీ డీఈఈ పి.సాయిరామ్‌ను నెల్లూరు నగరపాలక సంస్థకు, ఏపీటిడ్కో డీఈ కె.సేతుబాబును నెల్లూరు ఏపీ టిడ్కోకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన మంగళవారం బీవీ నగర్ సప్తగిరి కాలనీ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికంగా సుబ్బరామిరెడ్డి, శ్రీదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీదేవి తండ్రి మున్నా శ్రీనివాసులు రెడ్డి అయిదు సంవత్సరాలుగా కుమార్తె, అల్లుడి ఇంట్లోనే ఉంటున్నారు. కొంతకాలం క్రితం ఆయనకు పక్షవాతం రావడంతో మతిస్థిమితం సరిగా లేదు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన శ్రీనివాసులు రెడ్డి అదృశ్యమయ్యారు. వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ కిషోర్ కుమార్ కోరారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా మాస్ మీడియా అధికారి కె.కనకరత్నం, డీఎల్ఏసీ కమిటీ సభ్యురాలు కె.కుసుమకుమారి మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు.

ఎఫ్‌సీల మంజూరు ప్రైవేటుకు ఇవ్వడం తగదు



నిరసన ప్రదర్శనలో ఆటోకార్మికులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: వాహనాల ఫిట్‌నెస్ ధ్రువపత్రాల మంజూరును ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం తగదని జిల్లా ఆటో కార్మిక సంఘం, లారీ ఓనర్స్ అసోసియేషన్ నిరసన తెలిపాయి. మంగళవారం నగరంలోని ఆర్టీవో కార్యాలయం ప్రాంతంలో నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఆటో కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు టి.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఎంవీ యాక్టు సవరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరును ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమని ఆరోపించారు. దీనివల్ల రవాణా రంగం మీద ఆధారపడి ఉన్న లక్షలాది వాహన యజమానులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రాజా, కె.సురేష్, సీఐటీయూ రూరల్ గౌరవాధ్యక్షుడు బి.కృష్ణయ్య, అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, ఆటో కార్మిక సంఘం సిటీ కార్యదర్శి పి.మురళి, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసన్, ఎం.సుధాకర్, కార్మికులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో సమస్యల తిష్ఠ

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలోని ఫత్తేఖాన్‌పేటకు సమీపంలో ఉన్న శాంతినగర్‌లో ప్రముఖులు నివాసం ఉంటున్నారు. బహుళ అంతస్తులు ఉన్నాయి. ఇంతటి ప్రాంతంలో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. పారిశుద్ధ్యంపరంగా సరైన పర్యవేక్షణ లేదని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. రోడ్లకు ఇరువైపులా పలు వీధుల్లో తరచూ చెత్తాచెదారం అలాగే కనిపిస్తోంది. ప్రధాన రోడ్డులో కూడా అదే పరిస్థితి. ఇక్కడి పంటకాలువ ప్రస్తుతం మేజర్‌డ్రైన్‌గా కార్పొరేషన్ నిర్వహణలో ఉంది. దోమల బెడద తీవ్రంగా ఉంటోంది.

రహదారి గుంతలమయం: ప్రధాన రోడ్డు సైతం పలుచోట్ల గుంతలమయంగా దర్శనమిస్తోంది. దానికి ప్యాచ్ పనులు చేయించాలని ఒకటికి రెండు పర్యాయాలుగా ప్రయత్నం చేసి అంతలోనే సరిపెట్టుకున్నారు. నేటికీ మరమ్మతు పనులు చేయలేదని స్థానికులు వాపోతున్నారు. పలుచోట్ల కంకరరాళ్లు కూడాలేచి పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డులో ముఖ్యమైన కాలువలు పూడికతో నిండి దర్శనమిస్తున్నాయి. దోమల వల్ల కంటిమీద కునుకులేకుండా పోతోందని, ఎప్పుడూ తలుపులు వేసుకుని ఇంట్లో ఉండాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● కాలువల్లో పూడిక తీయించి ప్రధాన వీధుల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలిక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.



తవ్వి మరమ్మతులు చేయని ప్రధానరోడ్డు

దంత పరీక్షలు

నెల్లూరు(వేదాయపాలెం): ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చింతారెడ్డిపాలెంలోని ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. వైద్యులు హిమబిందు, టి.నళిని సహకారంతో పరీక్షలు చేశారు.